ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 06 నవంబరు , 2026 | పేజీలు : 6

పండుగల పేరుతో బస్ చార్జీలు పెంచొద్దు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పండుగల పేరుతో బస్సు చార్జీలు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం మోపవద్దని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్టీసీ ఆర్ ఎంకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం ఉన్నందున ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, అటు వంటి పరిస్థితుల్లో దీపావళి పండుగ పేరుతో బస్సు చార్జీలు పెంచవద్దని కోరారు. పండుగలకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలకు చార్జీల పెంపు పెద్ద భారంగా మారుతుందని, ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.వినతిపత్రం సమర్పించిన వారిలో పార్టీ ఉపాధ్యక్షులు ఎండి యూసఫ్,భాషాపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి బైపాస్‌లో భద్రత ఏదీ?

ప్రమాదాలకు నిలయంగా మారుతున్న జంక్షన్లు..మూడేళ్లుగా పట్టించుకోని అధికారులు

రోడ్డు మార్కింగులు లేవు..రాత్రివేళ వెలుగులు లేవు..ప్రమాదాల నివారణకు చర్యలేవీ

టోల్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రయాణికుల భద్రతపై ఏదీ

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవ చూపాలి



ప్రజాపక్షం/తిప్పర్తి: నార్కట్‌పల్లిఅద్దంకి ప్రధాన రహదారిపై నిర్మించిన తిప్పర్తి బైపాస్ ప్రయాణికుల పాలిట ప్రమాదకరంగా మారుతోంది. బైపాస్ నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా మండల కేంద్రానికి అనుసంధానమయ్యే ప్రధాన రహదారులు,కీలక కూడళ్ల వద్ద కనీస భద్రతా ఏర్పాట్లు లేకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు, టోల్ ప్లాజా యాజమాన్యం స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.బైపాస్‌పై సరైన రోడ్డు మార్కింగులు లేకపోవడం,రాత్రివేళల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడం,హెచ్చరిక బోర్డులు అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మరోవైపు వాహనాలు అతివేగంతో ప్రయాణిస్తుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉంది.ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిని దాటే వారు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

క్రాసింగ్ సౌకర్యం లేక..రాంగ్ రూట్‌లో ప్రయాణం

కన్నెకల్లు సహా సుమారు పది గ్రామాల ప్రజలు తిప్పలమ్మగూడెం మీదుగా తిప్పర్తి మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు.అయితే బైపాస్ వద్ద సరైన క్రాసింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో రాంగ్ రూట్‌లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని,ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నిత్యావసర రాకపోకలకు కీలకమైన ఈ మార్గంలో సురక్షిత ప్రయాణానికి అవసర మైన ఏర్పాట్లు చేయకపోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

టోల్ వసూళ్లే కాదు..భద్రత బాధ్యతా లేదా?

హైవేపై ప్రయాణించే వాహనాల నుంచి టోల్ రూపంలో రుసుములు వసూలు చేస్తున్న నిర్వహణ సంస్థ ప్రయాణికుల భద్రతకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రమాదకరమైన జంక్షన్లు, క్రాసింగ్‌ల వద్ద తగిన లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు రేడియం మార్కింగులు, హెచ్చరిక బోర్డులు,వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.అవసరమైన చోట సురక్షిత క్రాసింగ్ సౌకర్యాలు కల్పించి రాంగ్ రూట్ ప్రయాణానికి అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించాలి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని తిప్పర్తి మండల ప్రజలు కోరుతున్నారు. సంబంధిత ఆర్ అండ్‌బీ అధికారులు, హైవే నిర్వహణ సంస్థ, టోల్ ప్లాజా యాజమాన్యంతో సమీక్షించి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తక్షణ భద్రతా చర్యలు చేపట్టేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత పరామర్శలు కాదు..ప్రమాదం జరగకముందే భద్రత కావాలి! అధికారుల నిర్లక్ష్యం మరిన్ని విలువైన ప్రాణాలను బలిగొనకముందే తిప్పర్తి బైపాస్ లో అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.



సర్కారు ఆసుపత్రికి దారేది?

సూచిక బోర్డు లేక.. పిహెచ్‌సి ఎక్కడో తెలియక...

వైద్య సేవల కోసం వచ్చి వెనుదిరుగుతున్న బాధితులు

ప్రజాపక్షం/త్రిపురారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనం శిథిలావస్థకు చేరడంతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది.భవనంలోని స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండటంతో రోగులు, వైద్య సిబ్బంది భద్రత దృష్ట్యా డీఎంహెచ్ఓ రాహుల్ ఆదేశాల మేరకు ఆసుపత్రి సేవలను స్థానిక గ్రంథాలయానికి తాత్కాలికంగా మా ర్చారు. అయితే గ్రంథాలయం వద్ద పీహెచ్‌సీకి సంబంధించిన సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో వైద్య సేవలు ఎక్కడ అందుతున్నాయో తెలియక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం వైద్య పరీక్షలు,చికిత్సల కోసం వస్తున్న రోగులు పాత ఆసుపత్రి భవనం వద్దకు చేరుకుని అక్కడ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన వారు తాత్కాలికంగా ఆసుపత్రి సేవలు అందిస్తున్న ప్రదేశాన్ని గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆసుపత్రి సేవలను గ్రంథాలయానికి మార్చిన విషయాన్ని ప్రజలకు తెలియజేయడంలో సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.పాత ఆసుపత్రి భవనం వద్ద గ్రంథాలయంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు సూచించే బోర్డుతో పాటు,గ్రంథాలయం వద్ద కూడా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అని స్పష్టంగా తెలిపే సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రోగులకు వైద్య సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫార్మా కంపెనీ సహకారం



ప్రజాపక్షం/తుర్కపల్లి: తుర్కపల్లి మండలంలోని గోపాలపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం సుమారు 20 లక్షల విలువైన పాఠశాల భవనానికి ఇండియన్ ఇమ్యూనాలజికల్స్ ఫార్మాకంపెనీ యాజమాన్యం ముందుకు వచ్చిందని గ్రామ సర్పంచ్ పుట్ట సాయిలు గురువారం తెలిపారు. పాఠశాల భవన నిర్మాణానికి ఫార్మా కంపెనీ సహకరించటం గర్వించదగ్గ విషయమని గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు సర్పంచ్ పుట్ట సాయిలు తెలియజేసారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో, కంపెనీ నిధుల సహకారంతో అదనంగా మరో ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేయడం ఎంతో సంతోషకరమని అన్నారు.

తెనుగు కులస్తులకు న్యాయం చేయండి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి



ప్రజాపక్షం/మోత్కూర్: తెనుగు కులస్తులకు న్యాయం చేయాలని కోరుతు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. గురువారం మంత్రికి అందజేసిన వినతిపత్రంలో మోత్కూర్ అన్నపువాడలో ఉండబడిన 10 గుంటల భూమిని గీత పారిశ్రామిక సహకార సంఘం కింద ఫంక్షన్ హాల్ గా నిర్మాణం చేయాలి. మోత్కూరు గీతా పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యులుగా ఉంటూ తాతల తండ్రుల కాలం నుండి గీత కార్మికులుగా వృత్తి జీవనం సాగిస్తూ సంఘంలో ఉండబడిన 5 ఎకరాల భూమిలో భాగస్వామ్యం కల్పించాలి. గీత పారిశ్రామిక సంఘం ఆఫీసులో సగభాగంగా ఉంటున్న తెనుగు తెలుగు కులస్తులు 44 ఏళ్ల కిందట నాటి ఎంపీ గీతా పనివాళ్ల సంఘం ఉద్యమ నేత ధర్మభిక్షం తాలూకా స్థాయిలో మోత్కూరు గుండాల ఆత్మకూరు మండలాలకు సంబంధించిన గీత కార్మికులు పిల్లల చదువుకై మోత్కూర్ పట్టణంలో ఉండబడిన అన్య వీరయ్య 10 గుంటల భూమిని ఖరీదు చేసి అట్టి భూమిని సమన్వయంతో సంఘ సభ్యులు రూపకంగా వసూలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోనైనది. అట్టి భూమిలో తెనుగు కులస్తులైన మాకు హక్కు లేదని గౌడ సోదరులు మమ్మల్ని అవమాన పరుస్తున్నారని మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలో కలిసి మా సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన మంత్రి వెంక రెడ్డి ఇరువు వర్గాలను పిలిచి మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెనుగు కుల అధ్యక్షుడు అన్నపు వెంకన్న, గౌరవ అధ్యక్షులు అన్నేపు మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు కుల సంఘం ప్రధాన కార్యదర్శి మొదెల యాకు, సహాయ కార్యదర్శి అనేపు యాదగిరి, ఉపాధ్యక్షుడు ఎడ్లకొండలు, కోశాధికారి భాస్కర్, కమిటీ సభ్యులు బోయిన వెంకన్న, ఉప్పలయ్య , మొదెల కృష్ణ, అనేపు పిచ్చమ్మ, బోయిన జయమ్మ, పద్మ, సుగుణ, ధసమ్మ తదితరులు పాల్గొన్నారు



రైతులకు మద్ధతు ధర అందించడమే లక్ష్యం

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : రైతులకు మద్ధతు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బాలెంల గ్రామంలో సిసిఐ (కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ళను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పత్తికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్ధతు ధర అందించడమే లక్ష్యంగా సిసిఐ ద్వారా కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి యండి ఫసియోద్దీన్ (ముక్రం), మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు అనంతుల శ్యాంప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, సిసిఐ బయ్యర్ అమిత్, బాలెంల గ్రామ సర్పంచ్ గాలి నగేష్, ఉపసర్పంచ్ బుచ్చి రాములు, రామసాని రమేష్, మల్లయ్య పాల్గొన్నారు.

ఆధునిక వైద్యంతో సంతాన సమస్యలకు చెక్



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులు ఆందోళన చెందకుండా ఆధునిక వైద్య విధానాల ద్వారా తగిన చికిత్స ద్వారా పరిష్కరించుకోవచ్చని కన్సల్టెంట్ గైనకాల జిస్ట్, ఫెర్టిలిటి స్పెషల్ డాక్టర్ విజిత రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీహాన్ ఆసుపత్రిలో సంతానం లేని దంపతుల కోసం ఉచిత ఫెర్టిలిటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతానలేమి సమస్యకు మహిళలే కారణమనే అపోహ సరైంది కాదని స్పష్టం చేశారు. భార్యాభర్తలు ఇద్దరు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శ్రీనివాస్, శైలజ, సురేష్, స్వప్న, శ్రావ్య, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాపక్షం/గరిడేపల్లి : మండలంలోని కొండయ్యగూడెం గ్రామంలో సూర్యాపేట జమ్మిగడ్డ లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి వారు ఉచితంగా నిర్వహించిన కంటి పరీక్షల శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కందుల మంగమ్మ కోటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని సుమారు 120 మంది పరీక్షలు చేయించుకోగా 26 మందికి ఆపరేషన్ చేయించుకోవల్సి ఉందన్నారు. వారికి ఉచితంగా సూర్యాపేట జమ్మిగడ్డ హాస్పటల్‌లో ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ శిరీష మోహన్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి నరేష్, గ్రామ శాఖ అధ్యక్షులు కర్నె దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సిఎం సానుకూల స్పందన



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని టీఎస్ జిఆర్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం మిర్యాలగూడలోని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల సాధన కోసం న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్న తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి సమస్యల సాధనకు కృషి చేస్తానని చెప్పడం సంతోషదాయకమని అన్నారు. పీఆర్సీని సకాలంలో ఇవ్వలేకపోవడం వల్ల ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు నష్టపోతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు.రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పీఆర్సీని ప్రకటించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ సమావేశంలో టీఎస్ జిఆర్ఈఏ గౌరవ అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ పాషా, నల్గొండ జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, కార్యదర్శి హుస్సేన్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.వెంకట్‌రెడ్డి, మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్, సిహెచ్.గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలి



ప్రజాపక్షం/కోదాడ: సాయుధ రైతాంగ పోరాట పోరుగడ్డ అయినటువంటి నల్లగొండ పట్టణంలో ఈనెల 15వ లక్షలాది మందితో జరిగే రైతు బహిరంగ సభకు వేలాదిగా కదిలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ముల్కలపల్లి రాములు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 12 సంవత్సరాల కాలంలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడిందని ఫలితంగా దేశ వ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు పెరిగాయని విమర్శించారు. నల్లగొండలో జరిగే బహిరంగ సభకు రైతులు, కూలీలు, కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోటగిరి వెంకటనారాయణ, షేక్ సైదా, బుర్రి శ్రీరాములు, బచ్చలకూర స్వరాజ్యం, బెల్లంకొండ సత్యనారాయణ, బసవయ్య పాల్గొన్నారు.

మహిళ కౌన్సిలర్ల పరువుకు భంగం కలిగిస్తే సహించేదిలేదు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: మున్సిపాలిటి పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ పులిచింతల వెంకటరెడ్డి తమపై చేసినవి నిరాధారణమైన ఆరోపణలని, వాటిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ మహిళ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం మహిళ కౌన్సిలర్లు అందరూ మున్సిపల్ అధికారులను కలిసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల 11వ వార్డు కౌన్సిలర్ పులిచింతల వెంకటరెడ్డి కమిషనర్‌కు ఇచ్చిన లేఖలో అధికారిక కార్యక్రమాలు, చర్చలలో మహిళ కౌన్సిలర్లకు బదులుగా వారి భర్తలు పాల్గొంటున్నారని ఆరోపించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఏ రోజు కూడా అధికారిక కౌన్సిల్ సమావేశాలలో కౌన్సిలర్లు తప్ప వేరే ఇతర వ్యక్తులు గాని, కుటుంబ సభ్యులు గాని పాల్గొనలేదని స్పష్టం చేశారు. దురుద్దేశంతో తమ కుటుంబ సభ్యుల పరువుకు భంగం కలిగించేలా వెంకటరెడ్డి ఈ ఫిర్యాదు చేశారని, ఇటువంటి చర్యలు ముమ్మాటికి సహించరానివని అన్నారు. ఈ ఫిర్యాదుపై తక్షణమే విచారణ జరిపి అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మహిళ కౌన్సిలర్లు కోరారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ పెండింగ్ బకాయిలు చెల్లించాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఈఎస్ఐ డిస్పెన్సరీ పెండింగ్ బకాయిలు చెల్లించి తక్షణమే ఓపెన్ చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి రాము డిమాండ్ చేశారు. గురువారం మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఉన్న ఈఎస్ఐ హాస్పిటల్ భవనానికి తాళం వేయడంపై సమాచారం అందుకున్న ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రం నడుస్తున్న భవనానికి సంబంధించి రూ.17 లక్షలు అద్దె బకాయిలు ఉన్నాయన్నారు. అద్దె బకాయిల కారణంతో భవన యజమాని ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రానికి తాళం వేసినట్లు తెలిపారు. నెల రోజుల గడువు కోరిన అధికారులు బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు వారీగా 200 నుండి 300 మంది కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు వైద్య సదుపాయాల కోసం ఇక్కడికి వస్తుంటారని పేర్కొన్నారు.మిర్యాలగూడ డివిజన్ ఇండస్ట్రియల్ ఏరియాగా ప్రసిద్ధి చెందిందని, నిత్యం 50 వేల నుండి 60 వేల మంది కార్మికులు ఇక్కడ పని చేస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుసిసి జిల్లా కన్వీనర్ ఎండి.జలీల్‌బాబా, ఏఐవైఎల్ అధ్యక్షులు ఎం. రామకృష్ణ, ఏఐఎస్బీ అధ్యక్షులు ఎండి.నసీర్‌బాబా, ఏఐఏఎమ్ఎస్ జిల్లా నాయకులు పరమేశ్వరి, ఎల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు.



విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క కామ్రేడ్ జెసిఎస్ ప్రసాద్

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క కామ్రేడ్ జెసిఎస్ ప్రసాద్ అని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ 51వ వర్ధంతి సందర్భంగా పిడిఎస్‌యు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కామ్రేడ్ జాజిరెడ్డి మరణం తరువాత ప్రగతిశీల శిబిరం అంతా చల్లా చదరు అవుతున్న సందర్భంలో ఉస్మానియా యూనివర్సిటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ తిరిగి ప్రగతిశీల బాటలో పయనింపజేసే ఆలోచనలను అందరికి నూరిపోసి కోదాడ వేదికగా పిడిఎస్‌యు విద్యార్థి ఉద్యమ ముసాయిదాను తయారు చేశారు. నాయకులు ప్రవీణ్, యుగేందర్, గోపి, మహేష్, నవీన్, వినయ్, కుమార్, పవన్, శ్రీధర్ పాల్గొన్నారు.

టిబి నిర్ధారణ పరీక్షలు



ప్రజాపక్షం/మేళ్లచెరువు: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఆశా కార్యకర్తల సహకారంతో క్షయ (టిబి) వ్యాధి నిర్ధార్ణ ముందస్తు గుర్తింపు కోసం యాక్టివ్ కేస్ పైండింగ్ ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహించినట్లు సూపర్‌వైజర్ సిహెచ్ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం ఈ శిబిరంలో 16 మంది అనుమానితుల నుండి కల్లె నమూనాలను సేకరించినట్లు తెలిపారు. ఈ నమూనాకు మేళ్లచెరువు ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో నిక్షయ్ ఐడిలను క్రియేట్ చేసి ఖచ్చితమైన ల్యాబ్ పరీక్షల నిమిత్తం ల్యాబ్ టెక్నిషియన్ ద్వారా సూర్యాపేట టిహబ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ నిరూపమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిర్డిసాయిబాబా 25వ వార్షికోత్సవం వేడుకలు

ప్రజాపక్షం/నడిగూడెం: మండల కేంద్రంలోని వేంచేసిన శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో 25వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేక కార్యక్రమాలు, అనంతరం బాబా వారికి పుష్పాలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బాబా వారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులయ్యారు. భజనలు, సత్సంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్, స్థానిక సర్పంచ్ దున్న శ్రీనివాస్ లు హాజరయ్యారు. ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు పందిరి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, ఉప సర్పంచ్ ఎలుగూరి నాగరాజు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.





శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రజాపక్షం/నేరేడుచర్ల: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో కోలువుదీరిన శ్రీ వెంకటేశ్వస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కళ్యాణాన్ని తిలకించారు. అర్చకులు ఇటువంటి శ్రీనివాసశాస్త్రి నేతృత్వంలో శ్రీపాద శాస్త్రి, సంతుశాస్త్రి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్తరా నక్షత్రం అభిజిత్ లగ్న పుష్కరాంశము న శాస్త్రోక్తంగా కళ్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం దేవాలయ కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బిఆర్ఎస్‌లో చేరిక



ప్రజాపక్షం/కోదాడ: మూడు సంవత్సరాలు ముగియకముందే కాంగ్రెస్ సర్వభ్రష్ట ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ విమర్శించారు. గురువారం కోదాడ మున్సిపాలిటి పరిధిలోని 18వ వార్డులో పలువురు యువకులు బిఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి గెలిపించేందుకు కంకణ బద్దులై పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నయీం, ఉపేందర్‌గౌడ్, కరీముల్లాబాబా, చలిగంటి వెంకట్, బత్తుల ఉపేందర్, క్రాంతి పాల్గొన్నారు.

ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/రామన్నపేట: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే ఉద్దేశంతో మండల పరిధిలోని కుంకుడుపాముల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులెవరూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, సీఈఓ జంగారెడ్డి, గ్రామ సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్, ఉపసర్పంచ్ నల్ల మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యుడు పులిగిల్ల పరమేష్, గ్రామ పెద్దలు నల్ల శ్రీనివాస్ రెడ్డి, నాతి పరశురాములులతో పాటు మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అధిక ధరలకు మద్యం అమ్మకం

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ఎంఆర్‌పి ధర ప్రకారం అమ్మాల్సిన మద్యాన్ని మండల కేంద్రంలోని త్రిశూల వైన్స్‌లో క్వార్టర్‌కు రూ.10లు అదనంగా పెంచి అమ్మకాలు జరుపుతున్నారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న త్రిశూల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మందుబాబులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని దుబ్బతండ గ్రామానికి చెందిన భూక్య ప్రవీణ్ నాయక్ గురువారం మీడియాతో మాట్లాడుతూ తన ఇంట్లో జరిగిన శుభాకార్యానికి త్రిశూల వైన్స్‌లో మద్యం కొనుగోలుకు వెళ్ళగా జరిగిందన్నారు. కౌంటర్‌లో ఉన్న సిబ్బంది ప్రతి క్వార్టర్ సీసాపై రూ.10లు అదనంగా తీసుకోవడం జరిగిందని ఆరోపించారు. ఇదేమని వారిని ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం చెప్పడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఒక్కడికే ఇలా జరగలేదని వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరి నుండి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పారు. వీరి అక్రమ వసూళ్ళు వైన్ షాపులో ఉన్న సిసి కెమెరాలోని ఫుటేజిని పరిశీలిస్తే బయటపడుతుందని చెప్పారు. ఈ వైన్స్ షాపుపై ఆయా పత్రికల్లో వార్తా కథనాలు వచ్చినా ఎక్సైజ్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అధిక ధరలకు మద్యం అమ్ముతున్న యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరుతడి పంటలు సాగు చేయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా కంది, పెసర, మినుము, శనగ, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను సాగు చేయాలని ఏడీవీ జగదీష్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని తెలంగాణ సీడ్స్ విత్తన విక్రయ కేంద్రాన్ని ఆయన సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన డీలర్లతో మాట్లాడుతూ వరి విత్తనాలను విక్రయించరాదని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, రానున్న రోజుల్లో ఏర్పడే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని పంటల సాగు ప్రణాళికను ముందుగానే రూపొందించుకోవాలని తెలిపారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని



సూచించారు. వరిపై అధికంగా ఆధారపడకుండా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. భూగర్భ జలాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించడం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరమని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రుషేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు అభినందనలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు అభినందనలు అని ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి.సూర్య ప్రకాష్ తెలిపారు. గురువారం ఏపీలో అర్నబ్ తుఫాన్ ధాటికి పలు డివిజన్లలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా నర్సాపూర్ డివిజన్, మొగల్తూరు సెక్షన్‌లో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఎన్నో రోజుల నుండి గ్రామాలలో, పట్టణాలలో కరెంటు లేక ప్రజలు, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ మేనేజ్మెంట్ తక్షణ సహాయాన్ని అందించింది.అన్ని సర్కిల్స్ నుండి తెలంగాణ విద్యుత్ శాఖ సిబ్బంది ఏపీ రాష్ట్రానికి చేరుకున్నారు. నర్సాపూర్ డివిజన్, మొగల్తూరు సెక్షన్ స్థానిక ఏడీఈ రాజీవ్, లైన్‌మెన్ సుధీర్‌తో కలిసి కరెంటు పునరుద్ధరణ పనుల్లో భాగంగా గ్రామాలు, పట్టణాలను పరిశీలించడానికి ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి.సూర్యప్రకాష్, సీజీఎం, జీఎం వెళ్లారు. ఈ సందర్భంగా ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ నల్గొండ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ అమరారపు శ్రీనివాస్, మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ చారి, ఏఈలు వినోద్‌కుమార్, రవీందర్‌రెడ్డి, వీరభద్రం, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ మారం శ్రీనివాస్‌లతో పాటు కార్మికులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, కార్మికులు ఎల్లయ్యచారి, భిక్షమయ్య, జలంధర్, సతీష్, వెంకటరత్నం, సిబ్బంది వెంకన్న, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు రెడ్డిగట్టు శేషయ్య జీవితం ఆదర్శం

ప్రజాపక్షం/మోటకొండూర్: యువతకు రెడ్డిగట్టు శేషయ్య జీవితం ఆదర్శం అని, ఆయన అడుగు జాడలలో యువత ముందుకు సాగాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ గురువారం పిలుపునిచ్చారు. ఆయన మోటకొండూర్ మండల కేంద్రంలో రెడ్డిగట్టు శేషయ్య నగర్ లో కామ్రేడ్ అమరజీవి రెడ్డిగట్టి శేషయ్య 20వ వర్ధంతి సందర్భంగా శేషయ్య స్థూపానికి పూలమాల వేసి సిపిఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో నాటి రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని భూస్వామ్య పెట్టుబడి దారి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మాణం చేసి ఇక్కడి ప్రాంత ప్రజలను, కూలీలను, కార్మిక వర్గాలను చైతన్యపరిచి పోరాటాలు ప్రజా ఉద్యమాలు నిర్వహించిన గొప్ప మహా నాయకుడు శేషయ్య అని కొనియాడారు. మోటకొండూరు మాలుగడ్డ 950,



549సర్వే నెంబర్లలో ఇండ్ల స్థలాలను పంపిణి చేయించిన ఘనత ప్రజలు నేటికీ మర్చిపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు రేగు సిద్దయ్య, మండల పార్టీ కార్యదర్శి గాదగాని మాణిక్యం, ఆలేటి బాలరాజు, జీవిలికపల్లి పాండు, బీరకాయల మధు, జివిలికపల్లి గణేష్, బీర కాయల లక్ష్మి, బోలగాని లక్ష్మీ నారాయణ, జీవిలక పల్లి శేఖర్, సిద్దుల కుమార స్వామి, గడ్డం శీను, బీర కాయల పోశయ్య గొట్టిపాముల సునీల్ కుమార్, రెడ్డి గట్టు శేషయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మిర్యాలగూడలో నిలపాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలపాలని బీసీ జేవీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ దక్షిణ మధ్య రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ కార్యాలయంలో ఆయనను కలసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. సికింద్రాబాద్‌విజయవాడ 12796 ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, విజయవాడలింగంపల్లి 12795 ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో వెంటనే హాల్టింగ్ కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో విధులు నిర్వహించే ఉద్యోగులు, ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ప్రారంభించిన సికింద్రాబాద్‌విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలపకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

ప్రజాపక్షం/నేరేడుచర్ల: భూమికోసం, భుక్తికోసం, పీడిత ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహించాలని పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం నేరేడుచర్లలో హుజూర్‌నగర్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కామ్రేడ్ చంద్రా పుల్లారెడ్డి, పోట్ల రామనర్సయ్య, రవన్న అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లాలో ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేపడుతూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. వాస పల్లనన సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, లక్ష్మి, రజాక్, కృష్ణ పాల్గొన్నారు.

బిసిల హక్కుల కోసం జెండాలు పక్కనపెట్టి ఏకతాటిపైకి రావాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: బీసీలకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధించేందుకు అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీలు సంఘటితమై పోరాటం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ పిలుపునిచ్చారు. గురువారం మిర్యాలగూడలోని ఎన్ఎస్పీ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని గత ఎంతోకాలంగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు పరంగానే ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించేందుకు ప్రయత్నించకపోవడం బాధాకరమన్నారు.బీసీలు రాజకీయంగా ఎదగకుండా అనేక రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ పట్టణ బీసీ జేవీసీ కన్వీనర్ దాస రాజు జయరాజ్, జిల్లా నాయకులు నాయిని భాస్కర్, పట్టణ నాయకులు ఉపేందర్, పట్టణ కన్వీనర్ రమేష్, పట్టణ కోకన్వీనర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ టీకాల కార్యక్రమం

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో గురువారం పశువైద్యాధికారి డా. ప్రత్యూష ఆధ్వర్యంలో పశువులకు నట్టల నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్ పాల్గొని, పశువైద్యాధికారి డా. ప్రత్యూష ఆధ్వర్యంలో పశువులకు నట్టల నివారణ టీకాలను వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మోత్కూర్‌కు ఆర్టీసి బస్ డిపో ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/గుండాల; మోత్కూర్ ప్రాంతానికి ఆర్టీసి బస్ డిపో ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని బిజెపి సినియర్ నాయకులు, గుండాల మండల బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి గూడ నారాయణగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మోత్కూర్ పట్టణం చుట్టుపక్కల ఉన్న పలు మండలాల ప్రజలకు రవాణా పరంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మోత్కూర్ కేంద్రంగా ఆర్టీసి బస్ డిపోను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గుండాల, మోత్కూర్, వలిగొండ, ఆత్మకూరు మండలాలు అడ్డగూడురు ప్రజలకు మోత్కూర్ కేంద్రంగా ఆర్టీసి బస్ డిపోను ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ప్రస్తుతం వివిధ ప్రాంతాలకు ప్రయాణించేందుకు ప్రజలు బస్సుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు.

చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: మండలంలోని చిల్లాపురం గ్రామానికి చెందిన పరసనబోయిన నరసింహ చండూరు మార్కెట్ డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంగా ఉపసర్పంచ్ లింగంపల్లి పుష్ప జలంధర్ శాలువా పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేసి సన్మానించారు. మార్కెట్ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి అశోక్, బండి యాదయ్య, మేకల యాదగిరి, పరసనబోయిన యాదయ్య, సూరు రామచంద్రం, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దబ్బేటి సోంబాబుకు ఆత్మీయ సన్మానం



ప్రజాపక్షం/మోత్కూర్: సర్దార్ సర్వాయి పాపన్న యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులైన దబ్బేటి సోంబాబు గౌడ్ కు స్థానిక బిక్కేరు గుంటి శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గౌడ హక్కుల కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు సోంబాబు మాట్లాడుతూ జిల్లాలో గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ సూదగాని క్రిష్ణయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బుర్ర కృష్ణ, గౌరవ సలహాదారులు బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదగిరి మృతి బాధాకరం

ప్రజాపక్షం/డిండి; డిండి పట్టణానికి చెందిన మహేశ్వరం యాదగిరి మృతి బాధాకరం అని బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు.గురువారం యాదగిరి దశదిన కర్మ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గుర్రం రాములు, రామలక్ష్మ ణ్, బాసునాయక్, లక్ష్మ య్య, పీర్ మహమ్మద్, కుటుంబ సభ్యులు శేఖర్, గోపాల్, వెంకటేష్ ఉన్నారు.

వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: భువనగిరి పట్టణంలో శ్రీ ఆర్కే హాస్పిటల్ మరియు చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించు పల్లె పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా 146వ ఉచిత మెగా వైద్య శిబిరం, గచ్చిబౌలి స్టార్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్ నందు గురువారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ, వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవాయిస్ చిస్తీ, డిఎస్పీ రవీందర్, 30 వార్డ్ మెంబర్ లైక్ అహ్మద్, టౌన్ సీఐ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ హాస్పిటల్ వైద్య నిపుణులు పల్మనాలజిస్ట్ డాక్టర్ పెద్ది శ్రీకాంత్, కార్డియాలజిస్ట్ డాక్టర్ చక్రధర్, ఎముకల, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చావా రాజ్ కుమార్, డెంటల్ సర్జన్ డాక్టర్ చావ అశ్లేషా ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరం నందు ప్రజలకు ఉచితంగా బిపి, షుగర్, ఈసీ జీ, టుడిఎకో, పిఎఫ్టి పరీక్షలు ఉచితంగా నిర్వహించి డాక్టర్ల సలహా మేరకు మందులు పంపిణీ చేశారు.

ఐదుగురి ప్రాణాలను కాపాడిన ఆపద మిత్ర శివ



ప్రజాపక్షం/హాలియా: ఎస్‌డీఆఎఫ్‌బోటు బోల్తా పడిన సంఘటనలో ఐదుగురిని కాపాడి అధికారుల చేత ప్రశంసలు పొంది ఆపదమిత్ర పదానికి అసలైన నిర్వచనం చెప్పాడీ కందుల శివ కుమార్ అనే యువకుడు నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన కందుల శివకుమార్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే వారు.కాల్వల్లో, చెరువుల్లో మునిగి మృత్యువాత పడిన ఎంతో మందిని స్వతహాగా శివ ఒడ్డుకు చేర్చే వాడు.ఈక్రమంలో గత రెండు రోజులుగా కురిసిన మురుసు తుఫాను దాటికి ఖమ్మం జిల్లా అతలాకుతలమైంది.దీనిలో భాగంగానే సత్తుపల్లిలో జరిగిన బోటు బోల్తా పడిన సంఘటనలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఐదుగురి ప్రాణాలను కాపాడారు ఎన్‌డిఎంఏ ఆపదమిత్ర మాస్టర్ ట్రైనర్ కందుల శివ కుమార్.బోటు బోల్తా ఘటనలో సహాయక చర్యల్లో పాల్గొని ఐదుగురిని సురక్షితంగా కాపాడి వారి ప్రాణాలను నిలబెట్టిన శివను పలువురు అభినందించారు.ఖమ్మం జిల్లా కలెక్టర్ స్వయంగా స్పందించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి సత్తుపల్లి ఆసుపత్రిలో శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఆపదమిత్రగా పోలీసులు తనకు అవకాశం కల్పించి ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశం కల్పించడం నిజంగా తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బోటు బోల్తా ఘటనలో ఐదుగురిని కాపాడడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పాడు. ఆపద మిత్ర లు చేసిన సహసానికి జిల్లా కలెక్టర్ రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు తమను సన్మానించడం మర్చిపోలేని అనుభూతిని కలిగించిందని తెలిపారు.

ప్రతి పట్టభద్రుడి ఓటు ప్రజాస్వామ్య బలోపేతానికి పునాది



ప్రజాపక్షం/చండూరుః పట్టభద్రుల ఓటరు నమోదులో ప్రతి పట్టభద్రుడు భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర గీత కార్పోరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందకు తప్పనిసరిగా ఓటరూగా నమోదు చేసుకోవాలని కోరారు. నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటు నమోదు కోసం నల్లగొండ జిల్లా చండూరు తహసీల్దార్ రమాకాంత్ శర్మ కు గురువారం దరఖాస్తు తెలంగాణ రాష్ట్ర గీత కార్పోరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అందజేశారు . నవంబర్6 2026 తేదీలోగా అర్హులైన ప్రతి పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించి ఓటు నమోదు చేసుకునే విధంగా చూడాలని పల్లె రవికుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చండూరు మాజీ ఎంపిపి పల్లె కళ్యాణి రవికుమార్ గౌడ్ , బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు మహ్మద్ యూసుఫ్ , డిప్యూటీ తహసీల్దార్ సరిత , ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు మాదగోని అరుణ్ గౌడ్ , యనమల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టిసారించాలి

ప్రజాపక్షం/నిడమనూరు: ఎల్ నినో ప్రభావం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో అధిక లాభాలు అందించే ఆరుతడు పంటల సాగుపై దృష్టి సారించాలని ఏడిఏ సరిత సూచించారు.గురువారం మండల పరిధి వేంపాడు,ఎర్ర బెల్లి గ్రామాల్లో వ్యవసాయ భూములను సాగు చేసే పంటలను పరిశీలించి వాతావరణ పరిస్థితులు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో సాగునీటితోపాటు విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరికి బదులుగా పెసర, మినుము,బొబ్బర,మిర్చి తదితర కూరగాయ పంటలతో పాటు వేరుశనగ,నువ్వులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఏవో మునికృష్ణ వ్యవసాయ విస్తరణ అధికారులు గుండె మెడ క్రాంతి కుమార్,అంతయ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.





రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాపక్షం/రామన్నపేట: మండల కేంద్రంలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థులు నేమతుల్లా బేగ్ ,పర్నే ప్రణీత్ రెడ్డి లకు ఆక్వా ఫోనిక్స్ గ్రావెల్ బెడ్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ మీద 32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్ మాట్లాడుతూ తమ ప్రాజెక్టు ద్వారా విజ్ఞాన శాస్త్రంలో నూతన ఆలోచనలను ఆవిష్కరించిన విద్యార్థులను ,గైడ్ టీచర్ వెలిమినేటి మల్లేష్ ని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అస్మా, నాగరాజు, స్వామి, ముత్యాలు, సునీత, అనిత, సుధారాణి, శాంతి, సరిత, విద్యసాగర్, సాయి, వెంకట్, కాంప్లీ, అనిల్, విజయ, జానకి, గాయత్రీ, రాజేశ్వరి, శోభ, ఉమా భారతి, ఉమా, అంజలి, సింధు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు బహుకరణ



ప్రజాపక్షం/మోత్కూర్: మోత్కూర్ శాఖా గ్రంధాలయానికి భువనగిరికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, సమాజ సేవకులు, సాహితీ పోషకులు సోమ సీతారాములు గురువారం నాడు 20 పుస్తకాలను మోత్కూర్ గ్రంథాలయ కమిటీ చైర్మన్ కోమటి మత్స్య గిరికి అందజేశారు. ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే పుస్తకాలు వేద పరిమళాలు, రామావతారం, భక్త ప్రహ్లాద చరిత్ర, షిరిడీ సాయి అమృత లీలలు, ఆధ్యాత్మిక మాణిమాల, రంగ్ మహల్, సద్గురు సుభాషితాలు, అపురూప అమెరికా, భారతీయ మహిళ, గుడి నానీలు, తదితర పుస్తకాలను శాఖ గ్రంధాలయానికి బహూకరించారు. మోత్కూరుగ్రంథాలయం చేపట్టిన పుస్తకాల సేకరణ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు మర్రి మల్లేష్ పాల్గొన్నారు. సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మోత్కూర్ శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ పక్షాన సోమ సీతారాములుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతల నిర్వహణలో పోలీసులు అప్రమత్తం

ప్రజాపక్షం/ మోటకొండూర్: శాంతి భద్రతల నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అకాంక్ష్‌యాదవ్ ఐపిఎస్ అన్నారు. ఆయన మోటకొండూరు పోలీస్ స్టేషన్ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు, కేసుల వివరాలు మరియు పోలీస్ శాఖలోని వివిధ విభాగాల వేర్టికల్స్ (Verticals) పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్లో ఉన్న కేసుల పురోగతి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణపై సమీక్షించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాల నియంత్రణకు సమర్థవంతంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూర్ ఎస్ఎచ్ఓబి. కుమారస్వామి, ఏఎస్ఐ ప్రకాష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





ఎల్‌నినో ప్రభావంపై నివారణ చర్యలు

ప్రజాపక్షం/దేవరకొండ; మైనంపల్లి గ్రామం కొత్రతండాలో ఎల్‌నినో ప్రభావంపై నివారణ చర్యలు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం గురువారం స్థానిక సర్పంచ్ కొత్ర రాంసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కోరారు. అనంతరం నీటి ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు లక్ష్మి ప్రశాంత్, సునిత బద్దు, కిషన్, మాజీ సర్పంచులు పాండు, అంత్య, గ్రామస్థులు శ్రీకాంత్, కేస్య, జగన్, జబ్బార్‌లాల్, దీప్ల, పాండు పాల్గొన్నారు.

ఎక్కువ మందితో పని చేయించాలి



ప్రజాపక్షం/మోటకొండూర్: ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక కరువు ఎర్పడుతుండడంతో గ్రామాలలో పనులు దోరకకపోవడంతో ప్రజలు వలసలు పోకుండా కూలీలకు ఎక్కువ పనులు కల్పించాలని మోటకొండూర్ ఎంపిడిఒ ఇందిర అన్నారు. ఆమె గురువారం మోటకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కుంటుంబానికి 125 రోజుల పని కల్పించాలని, కొత్తగా పెళ్ళైన వారికి నూతన జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. మేట్లు మస్టర్‌లలో కొట్టివేతలు, దిద్దడం లేకుండా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ చంద్రశేఖర్, ఈసిలు గోవార్దన్, రాజశేఖర్, టిఎలు స్వామి, వెంకట్ నారాయణ, చంద్ర మోహన్, వివిద గ్రామాల మేట్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం మహా హోమం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పట్టణ పరిధిలోని పానగల్‌లో గల శ్రీశంకర గోసంరక్షణ చారిటబుల్ ట్రస్ట్ గోశాలలో గురువారం శ్రీ లక్ష్మీ నృసింహ విశ్వశాంతి మహా హోమం శ్రీ విద్యా ఉపాసకుల సహకారంతో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈహోమం లోక కల్యాణం,సనాతన ధర్మ పరిరక్షణ,గోసంరక్షణ,ప్రజల ఆయురారోగ్యం,సుఖసంతోషాలు,విశ్వశాంతి కాంక్షిస్తూ యజ్ఞ పూజలునిర్వహించడం జరిగిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఝాన్సీ,జనార్దన్ గౌడ్,ఫణీంద్ర,హనుమాన్ టెంపుల్ అయ్యగారు,దివాకర్ శర్మ,అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి,రావిపోలు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాల సేకరణ

ప్రజాపక్షం/డిండి; రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుండ్లపల్లి(డిండి) మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎండిపోయిన పంటలు, పంట నష్టానికి సంబంధించిన వివరాల సేకరణ జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రేహానా గురువారం తెలిపారు. ఏఈవోలు గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి, పంట నష్టం జరిగిన రైతుల వివరాలు, పంట నమోదుకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేస్తున్నారని పంట నష్టం జరిగిన రైతులందరూ తమ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులకు అందుబాటులో ఉండి, తమ పంట పొలాలను అధికారులకు చూపించి అవసరమైన వివరాలను అందించాలని ఆమె సూచించారు.

మర్రిగూడలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/మర్రిగూడ :మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెనుకబడిన మర్రిగూడ మండలంలో వెంటనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వ పాఠశాలలు,హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారని,వెంటనే సౌకర్యాలు కల్పించాలని అన్నారు.ఈ సందర్భంగా మోడల్ స్కూల్లో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షినా,కార్యదర్శిగా నందకుమార్‌తోపాటు 21 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు ఇరిగి ప్రవీణ్,మండల నాయకులు నందకుమార్,అజయ్,విక్రమ్‌పాల్గొన్నారు.

క్రైస్తవ మహిళలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :హైదరాబాదులోని అల్మస్‌గూడలో ఇద్దరు క్రైస్తవ మహిళలను అతి దారుణం కొట్టి హింసించడం దుర్మార్గమైన చర్య అని వారిని కఠినంగా శిక్షించాలని యూడిసిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు పాస్టరమ్మ వంగూరి జయ(దేబోరా) అన్నారు. గురువారం పట్టణంలోని గడియారం సెంటర్లో గల బాప్టిస్ట్ చర్చిలో యూడీసీఫ్ జిల్లా అధ్యక్షుడు డి.ఐ శాంసన్, ప్రధాన కార్యదర్శి పెదమాము దేవిడ్ రాజు ఆధ్వర్యంలో యూడీసీఫ్ జిల్లా మహిళ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా పాస్టరమ్మ వంగూరి జయ(దేబోరా) కమిటీ సభ్యులుగా శృతి,శైలజ,రుతమ్మ , వెంకటమ్మ,రాజకుమారి,వరలక్ష్మి,నాగేంద్ర,నాగమణి, విజయ రాణి,నాగమణి,లిడియా ను ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన మహిళా అధ్యక్షురాలు వంగూరి జయ మాట్లాడుతూ తమపై నమ్మకంతో తనను అధ్యక్షురాలుగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తూ సంఘ బలోపేతానికి కృషి చేస్తూ క్రైస్తవ సమాజ అభివృద్ధి కై నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు అజార్య నాయక్, ఏపీ.ప్రభాకర్,చంద్ర పాల్,లింగ రెడ్డి,లాజర్, యోహాను, లూకాస్,యాకీన్ పాల్గొన్నారు.

తబలా వాయిద్యంలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పి.అక్షయ్ తబలా వాయిద్య విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించడం నూర్యాపేట జిల్లాకు గర్వకారణమని జిల్లా విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థి అక్షయ్‌తో పాటు పాఠశాల సిబ్బందికి అభినందనలు తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తమ అభిరుచులకు అనుగుణంగా వివిధ కళారంగాల్లో ప్రతిభను చాటుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్రస్థాయి విజేత అక్షయ్‌కు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రదానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

194 ఇళ్లకు మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించి నిజమైన అర్హులైన పేదలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ డిమాండ్ చేశారు. గురువారం మిర్యాలగూడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో రెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన అనంతరం, ఆర్డీవో కార్యాలయం ఎదుట ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న బాధితులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు కృషితో మిర్యాలగూడ మున్సిపాలిటీకి 565 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో 40 ఇళ్లను భూనిర్వాసితులకు కేటాయించగా, మిగిలిన ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి వార్డుల వారీగా సభలు నిర్వహించారని పేర్కొన్నారు. ప్రజల సమక్షంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు గుర్తుచేశారు. అయితే ఎంపికైన వారిలో 194 మందికి అర్హత లేదనే కారణంతో ఇప్పటివరకు పట్టాలు అందించలేదని నాయకులు తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి కొత్త దరఖాస్తులు స్వీకరించకుండా, సమగ్ర సర్వే నిర్వహించకుండా ఇళ్ల కేటాయింపులు చేపట్టడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నబీమోజు నాగార్జునచారి, ఎండి.ఇలియాస్‌ఖాన్, ఎండి.మగ్ధంపాషా, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండి.మాజీద్, పద్మశెట్టి లక్ష్మి కోటేశ్వర్ రావు, దైద సత్యం, బంటు శ్రీనివాస్, పునాటి లక్ష్మీనారాయణ, పాలరపు సత్యనారాయణ, జాని, సాధినేని శ్రీనివాస్‌రావు, సందేషి రజిని, అంజన్ రాజు, పెండ్యాల పద్మ, కోదాటి రమా, గద్దం దీపిక, విజయ్, గుడిసె జానకమ్మ, దుర్గాప్రసాద్, తిరుమలగిరి వజ్రం పాల్గొన్నారు.

ఎండిన పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలి

ప్రజాపక్షం/నాంపల్లి : మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినప్పటికీ,అధికారులు ఇప్పటివరకు క్షేత్రస్థాయికి వచ్చి ఎండిపోయిన పంటలను పరిశీలించకపోవడం విచారకరమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజయ్య చారి అన్నారు. కరువు పరిస్థితుల కారణంగా నీళ్లు లేక వరి,వర్షాభావంతో పత్తి పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ,రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి నాంపల్లి మండల పరిధిలోని ఎండిపోయిన పంటలను స్వయంగా పరిశీలించి సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. వర్షాలు లేక నీటి ఎద్దడి పెరగడంతో పశువులకు తీవ్ర పశుగ్రాసం కొరత ఏర్పడిందని,పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పశుగ్రాసంపై సబ్సిడీని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పంట నష్టం అంచనా వేసి నివేదికలు ప్రభుత్వానికి పంపితేనే రైతులకు న్యాయం జరుగుతుందని, అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

గీత పనివారల సంఘం చండూరు మండల నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/చండూరుః గీత పనివారల సంఘం చండూరు మండల నూతన కమిటీని చండూరు లో జరిగిన మండల సమావేశంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా పుల్లెంల గ్రామానికి చెందిన బోయపల్లి శంకరయ్య , ప్రధాన కార్యదర్శిగా కస్తాల గ్రామానికి చెందిన గంట నాగేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. వీరితో పాటు మండల గౌరవ అధ్యక్షుడుగా నక్కపోతు ముత్తయ్య , జిల్లా రాములు ,ఉపాధ్యక్షుడుగా నకిరెకంటి భిక్షమయ్య , గునగంటి యాదయ్య , సహాయ కార్యదర్శులుగా పల్లె యాదయ్య , బోయపల్లి లింగయ్య ఏకగ్రీంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గీత పనివాల సంఘం ను చండూరు మండలంలో బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండాఇ కృషి చేస్తామని అన్నారు. గీత పనివారల హక్కుల కోసం పోరాటాలు ,ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బు వీరస్వామి , బొడిగె సైదులు , నల్వరాజు రామలింగయ్య , పల్లె యాదయ్య , బొడ్డు వెంకటేశ్వర్లు , పల్లె యాదయ్య , గండు కేశవులు , నర్సింహ్మా, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా బిఆర్ఎస్ శ్రేణుల కృషి

ప్రజాపక్షం/డిండి; రానున్న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై గురువారం దేవరకొండ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి దేవరకొండ మాజీ ఎంఎల్‌పి రమావత్ రవీంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిని నాయకులతో సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలు, పట్టణాల్లోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా ప్రతి నాయకుడు, కార్యకర్త తమ బాధ్యతను గుర్తించి చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. అర్హులైన ఒక్క పట్టభద్రుడు కూడా ఓటు హక్కు నమోదు చేసుకోకుండా మిగిలిపోకూడదని పేర్కొన్నారు.





ప్రవీణ్ కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/చిట్యాలఃి నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి బిఆర్ఎస్ యువజన విభాగం పట్టణ శాఖ అధ్యక్షులు చిత్రగంటి ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం దశదిన కర్మ పురస్కరించుకుని పట్టణ బిఆర్ఎస్ నాయకులు నివాళులు అర్పించారు. పార్టీ తరపున సేకరించిన రూ. 31వేలు ప్రవీణ్ కుటుంబానికి అందజేశారు. పార్టీలో చురుకుగా పనిచేసే ప్రవీణ్ తమ మధ్య లేక పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్ నిమ్మనగోటి శ్రీనివాస్, పార్టీ నాయకులు జిట్ట బొందయ్య, బొబ్బల శివశంకర్‌రెడ్డి, ఆగు అశోక్, రుద్రవరం యాదయ్య, బొలుగూరి సైదులు, ఆవుల ఆనంద్, జిట్ట శేఖర్, సాయిరెడ్డి ప్రతాప్ రెడ్డి, పోకల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/మునగాల: మండల పరిధిలోని నారాయణ గూడెం గ్రామంలో గురువారం ఉచిత టిబి, ఎక్సరే పరీక్ష లతో పాటు ఎసిఎఫ్ వైద్య శిబిరాన్ని సర్పంచ్ కాంపాటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రోగులకు దగ్గు, ఆయాసం, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, క్షయవ్యాధి లక్షణాలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడివో నరేష్, పంచాయతీ కార్యదర్శి రజిత, హెల్త్ సూపర్‌వైజర్ సుభాషిని, నోడల్ ఆఫీసర్ లింగం రామకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, ల్యాబ్ సూపర్‌వైజర్ సైదులు, ల్యాబ్ టెక్నిషియన్ ఫణేందర్, సిపిఎం నాయకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

30 పోలీస్ యాక్ట్ అమలు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్‌పి కె. నరసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలకు డిఎస్‌పి, పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. నిషేధిత ఆయుధాలు కత్తులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు ఎవ రూ కూడా వాడవద్దన్నారు. ప్రజా జీవనానికి ఇబ్బందులు పెట్టకూడదన్నారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డిజెలకు అనుమతులు లేవన్నారు. ప్రచార రథాలు, మైక్‌లు వాడవద్దన్నారు.

ఆపదమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/నందికొండ : అత్యవసర పరిస్థితుల్లో ఆపద మిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు దాసరి రాజశేఖర్ కోరారు.జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో సుశిక్షితులైన యువ ఆపద మిత్రలను గురువారం విద్యార్థులకు పరిచయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు యువ ఆపద మిత్ర కార్యక్రమానికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బోడ సతీష్ చంద్ర, చింతపల్లి వెంకటయ్య,ఏ. ప్రసన్నలక్ష్మి,సైదమ్మ, గోపాల్, ఉపేంద్ర చారి,జనార్దన్,శంకర్,రవీందర్,మాధురి, దివ్య, ఫాతిమా,జాన్ రెడ్డి,గోపి పాల్గొన్నారు.



భవిష్యత్తులో బిసిలదే రాజ్యాధికారం

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో బీసీ రాజ్యాధికార పార్టీ గురువారం చేపట్టిన పాదయాత్రలో భాగంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ జనాభాలో అత్యంత తక్కువగా ఉన్న అగ్రకులాలు అధికారంతో అరగదుకుతున్నారని విమర్శించారు. భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలంతా ఏకమై అగ్రకుల అహంకారానికి అడ్డుకట్ట వేయకుంటే బానిసలుగా బతికే రోజులు రానున్నాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 14,500 కిలోమీటర్ల రాజ్యాధికార యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్, మదన్మోహన చారి, డోలు దెబ్బ నాయకులు మాల్లయాదయ్య, సతీష్ , కడ్తాల యాదగిరి రాజ్యాధికార పార్టీ జిల్లా మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పట్టణంలోని సాగర్ రోడ్డు నుండి వెంకటరమణ కాలనీకి వెళ్లే రహదారి విషయమై గురువారం నల్లగొండ మాజీ శాసనసభ్యులు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్‌ని స్థానిక కార్పొరేటర్లు,కాలనీ ముఖ్యులతో కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ గతంలోనే తాము శాసనసభ్యులుగా ఉన్న సమయంలో సాగర్ రోడ్డు నుండి వెంకటరమణ కాలనీ వరకు 100 మీటర్ల పొడుగునా దారి తీశామని,అప్పటి ఎస్పి దృష్టికి ఈ విషయం తీసుకొచ్చామని కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా దారి తీయడానికి వారు అంగీకరించిన తర్వాతే తాము విద్యుత్ లైన్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా పూర్తి చేశామని తెలియజేశారు. ఎస్పి ని కలిసిన వారిలో కార్పొరేటర్‌లు, మారగోని భవాని గణేష్ దీప్లా నాయక్,గోపగోని స్వాతి రాజశేఖర్,నగర యూత్ వైస్ ప్రెసిడెంట్ వజ్జ శ్రీనివాస్ యాదవ్ స్థానిక నాయకులు కన్నె బోయిన రమేష్, కునుకుంట్ల శంకర్, కందుల నరేందర్,తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణే లక్ష్యం

ప్రజాపక్షం/రామన్నపేట: రామన్నపేట పట్టణంలో ఎదురవుతున్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించడంలో భాగంగా గ్రామపంచాయతీ పాలకవర్గం కీలక చర్యలు చేపట్టింది. పట్టణంలో ఎల్ నినో వలన ఏర్పడనున్న నీటి సరఫరాపై ప్రభావం ఉండే ప్రాంతాలను గుర్తించి, ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా రెండు శక్తివంతమైన 5 హార్స్ పవర్ సబ్మర్సిబుల్ మోటార్లను అమర్చి, ప్రారంభించారు. పట్టణంలోని పద్మశాలి కాలనీలో సంగిశెట్టి శేఖర్ ఇంటి వద్ద ఒకటి, జనంపల్లి రోడ్డులోని ఎల్లమ్మ గుడి సమీపంలో మరొక మోటార్‌ను సర్పంచ్ గరిక సత్య నారాయణ, ఉపసర్పంచ్ మోటే రమేష్, గ్రామపంచాయతీ పాలకవర్గం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వంగాల సైదిరెడ్డి, వార్డు సభ్యులు జాడ సంతోష్, సుర్వి హరిబాబు, కొమ్ము శేఖర్, మోటే మహేష్, బండ కవితలింగస్వామి, అంజద్, నోముల అనిత యాదయ్య, సకిరేకంటి పార్వతమ్మసుదర్శన్, గొరిగే పారిజాతశేఖర్, కొమ్ము రామస్వామి పాల్గొన్నారు.



జాతీయ బాలల సైన్స్ రాష్ట్రస్థాయి పోటీలకు వాసాలమర్రి విద్యార్థులు



ప్రజాపక్షం/తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బుధవారం పెన్షనర్స్ భవన్ లో నిర్వహించిన 32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాసాలమర్రి విద్యార్థినిలు జూపల్లి భవాని, హనుమయ్యగారి రితిక లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, భువనగిరి మండల విద్యాధికారి రంగరాజన్ చేతుల మీదుగా విద్యార్థులు జ్ఞాపిక మరియు ప్రశంసా పత్రం అందుకున్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పత్తి బాలమణి, మండల విద్యాధికారి పుల్లెంల మంజుషా రాణి, ఉపాధ్యాయులు సౌమ్య, శ్రీనివాస్ రెడ్డి, హసీనా, వేణు, అమీర్, జంగారెడ్డి తదితరుల తోపాటు మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల కృషిని అభినందించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/తుర్కపల్లి: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి సద్వినియోగం చేసుకోవాలని తుర్కపల్లి మండల పిఏసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్ తెలిపారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు తుర్కపల్లి మండలంలోని గంధమళ్ళ, వీరారెడ్డిపల్లి, ఇబ్రహీంపూర్, దత్తయపల్లి, వెంకటాపూర్, తుర్కపల్లి, వాసాలమర్రి, తిరుమలాపూర్, చిన్న లక్ష్మాపూర్ గ్రామాల్లో పిఏసీఎస్, ఐకెపి సెంటర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, మోహన్ బాబు, దేవరుప్పుల ఐలయ్య, బొత్త రాములు పాల్గొన్నారు.





మంత్రికి వినతి పత్రం సమర్పించిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలను కోరుతూ ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఉద్యోగులు,జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు అందరు కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి రాష్ట్రకేబినెట్ లో చర్చించి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారి పేర్కొన్నారు. మంత్రికి వినతి పత్రం సమర్పించిన వారిలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు డాక్టర్ దయానంద్,డాక్టర్ హరిప్రియ,డాక్టర్ రాంబాబు, మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్,ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక, ఎమ్ఎల్‌హెచ్ పి మౌనిక,ప్రతిభ,డాక్టర్ వెంకటేశం,శ్రీనివాస్,డాక్టర్ గణేష్,ఎండీ ఖలీమ్,డాక్టర్ టి.రవి,ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్టులు,ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వేముల వీరేశానికి తృటిలో తప్పిన ప్రమాదాలు



ప్రజాపక్షం/నకిరేకల్: ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు ఒకే రోజు రెండు చోట్ల ప్రమాదాలు తృటిలో తప్పాయి. కట్టంగూరు మండలం చెరువు అన్నారం వద్ద ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది.ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో క్షేమంగా బయటపడ్డారు. అనంతరం చిట్యాల మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మరో కారులో భువనగిరికి బయలుదేరారు.ఈక్రమంలో మరోచోట ఆయన ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ఘటన నుంచి కూడా ఆయన సురక్షితంగా బయటపడ్డారు.అనంతరం జనగామ పర్యటనలో పాల్గొన్నారు.వరుసగా రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పటికీ ఎమ్మెల్యేకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అనుచరులు,అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

డ్రైనేజీ సమస్యకు చొరవ.. రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు

ప్రజాపక్షం/నాంపల్లి : మండల కేంద్రం నుంచి పెద్దాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై గత కొంత కాలంగా డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహించడంతో రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది.దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు,గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నీరు నిరంతరం రోడ్డుపై ప్రవహించడం వల్ల రహదారి మరింత ధ్వంసమై ప్రమాదాలకు అవకాశం ఏర్పడింది. ఈ సమస్యను గుర్తించిన నాంపల్లి గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్ బుధవారం స్వయంగా పనుల వద్ద ఉండి జేసీబీ సహాయంతో డ్రైనేజీ నీరు రోడ్డు పైకి రాకుండా కాలువ తవ్వించే పనులు చేపట్టించారు.డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా కాలువను ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బుర్రి శ్రీను,వార్డు సభ్యులు కామిశెట్టి నాగరాజు,సిబ్బంది, ఉన్నారు.

